
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 10 ఏప్రిల్ 2024 | 5






పవన్‌కు ఉగాది పచ్చడి తినిపిస్తున్న వర్మ

ఉభయ గోదావరి జిల్లాల్లో చంద్రబాబు, పవన్ రోడ్ షో

- నేడు తణుకు, నిడదవోలుల్లో ఉమ్మడిగా రోడ్ షో
- రేపు అంబాజీపేట, అమలాపురంల్లో బహిరంగ సభలు
- అమలాపురం పర్యటనకు విడుదల కాని పవన్ షెడ్యూల్



రాజమహేంద్రవరం/అమలాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఉమ్మడిగా రోడ్ షో, బహిరంగ సభలు నిర్వహించనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం చంద్రబాబు, పవన్ రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మీదుగా నిడదవోలు చేరుకుంటారు. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో రాత్రి 7 గంటలకు రోడ్ షో నిర్వహిస్తారు.సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు. అనంతరం చంద్రబాబు నిడదవోలులోని తిరుమల సాయి కల్యాణమండపంలో రాత్రి బస చేస్తారు. పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బస చేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నేతలతో నిడదవోలులో సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం 2 గంటలకు బయలుదేరి చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.25 గంటలకు అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగుతారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన ఇంకా షెడ్యూలు విడుదల కాలేదు. ఆయన కూడా ప్రత్యేక హెలికాప్టర్‌లో అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో దిగనున్నారు. చంద్రబాబు హైస్కూలు గ్రౌండ్ నుంచి 3.30 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు అంబాజీపేట నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ 4 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారు. గంటన్నర సేపు జరిగే సభ అనంతరం రోడ్డు మార్గాన అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తారు. 8.45 గంటలకు సభ ముగిసిన తరువాత చంద్రబాబు కిమ్స్ వైద్యశాల గ్రౌండ్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు.ఇప్పటికే నిడదవోలు, అంబాజీపేటలో పర్యటనకు సంబంధించి టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కందుల దుర్గేష్, రెడ్డి సుబ్రహ్మణ్యం, నిమ్మల రామానాయుడు, కొత్తపల్లి సుబ్బారాయుడు,గన్నవరం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, గణపతి వీరరాఘవులు ఏర్పాట్లపై సమీక్షించారు.



పవన్‌తో రఘురామరాజు భేటీ

పవన్ కేరాఫ్ పిఠాపురం!

- ఇక్కడి నుంచే కూటమి విజయ ప్రస్థానం
- రాబోయే ఎన్నికల్లో కూటమిదే ప్రభుత్వం
- చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం
- నివాసం, జనసేన కార్యాలయం ఇక్కడే
- ఉగాది వేడుకల్లో జనసేనాని.. పచ్చడి తినిపించిన వర్మ
- వేదపండితులకు సత్కారం
- హైదరాబాద్‌కు పయనం



పంచాంగాలు ఆవిష్కరిస్తున్న పవన్





కొత్త ఇంటి వద్ద పవన్‌కు మహిళల హారతి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి), పిఠాపురం,గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 9: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పురుహూతిక అమ్మవారి దయ, శ్రీపాదశ్రీవల్లభుడు, బంగారు పాపమ్మ ఆశీస్సులు, దీవెనలతో పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అందరి మద్దతుతో కూటమి ప్రభుత్వం ఇక్కడి నుంచే విజయప్రస్థానం సాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చేబ్రోలులో హైవేను ఆనుకుని ఉన్న ఇంట్లో పవన్ నూతన గృహప్రవేశం చేసి మాట్లాడారు. ఈ ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు దంపతులు, వారి పిల్లలు రెండేళ్ల కిందట మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చారని గుర్తు చేశారు. అప్పుడు వీరంతా తనను పిఠాపురం నుంచి పోటీ చేయాలని కోరారని, కానీ అప్పుడు తాను అంతగా ఆలోచించలేదన్నారు. ఒక నియోజకవర్గం నుంచి తనను పోటీ చేయాలని ఇంతమంది కోరుకుంటారని అనుకోలేదన్నారు. ఆ రోజున పిఠాపురం ప్రజల గొంతుని, ఆకాంక్షని ఆ తల్లి (పురుహూతికా అమ్మవారు) ఓదూరి దంపతుల ద్వారా నా దృష్టికి తీసుకువచ్చిందని ఇప్పుడు భావిస్తున్నానన్నారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో రాష్ట్రంలో మార్పునకు పిఠాపురం నుంచే శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు. చేబ్రోలులో ఉన్న గృహమే ఇకపై తన నివాసమని, ఇక్కడే జనసేన కార్యాలయం ఉంటుందని ప్రకటించారు. ఈ ఏడాది అంతా క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. తన కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు అభినందనలు చెప్పారు. కొత్త ఇంటిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్, బీజేపీ నేత కృష్ణంరాజులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలకు సమయం దగ్గరపడడంతో ప్రచారాన్ని పెంచే అంశంపై చర్చించారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు పవన్‌తో భేటీ అయ్యారు. రఘురామ పోటీ చేసే స్థానం ఏంటనే దానిపై చర్చించుకున్నారు. సమావేశాలు ముగించుకుని మధ్యాహ్న భోజనం అనంతరం మధ్యాహ్నం 3.18 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి పవన్ హైదరాబాద్ బయలుదేరారు. కార్యక్రమాల్లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, నేతలు వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, కల్యాణం శివ శ్రీనివాస్, ఎన్.శంకరగౌడ్, యాతం నగేష్, ఏవీ రత్నం, బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం

పవన్ చేబ్రోలులో తీసుకున్న ఇంట్లో మంగళవారం గృహ ప్రవేశం చేశారు. హైదరాబాదు నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరిన పవన్ మంగళవారం ఉదయం 10.07 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గాన చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నివాసానికి చేరుకున్నారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి పవన్‌ను ఆహ్వానించారు. గృహప్రవేశం అనంతరం ఇంట్లో పవన్ పూజలు చేశారు. ఇంట్లో మూడు అంతస్తులను తిరిగి చూసి అదే ఆవరణలో ఏర్పాటుచేసిన ఉగాది వేడుకల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లతో కలిసి పాల్గొన్నారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. పవన్ కల్యాణ్‌కు వేద ఆశీర్వచనాలు పలికి సత్కరించారు. అనంతరం వేదపండితులను పవన్ సత్కరించి పంచాంగాలు అందజేశారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సతీమణి లక్ష్మీదేవితో కలిసి ఉగాది పచ్చడిని పవన్‌కు తినిపించారు. అనంతరం వెండి గ్లాసుల సెట్, ఉగాది పచ్చడిని ప్రత్యేక డబ్బాలో ఉంచి వర్మ పవన్‌కు అందించారు. వెంకటేశ్వరస్వామి ఫొటోను అందించారు. బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు దంపతులతో ఫొటో దిగారు. ఉగాది వేడుకలకు కూటమి నాయకులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారు. మల్లాం, ఎఫ్‌కేపాలెం మాజీ సర్పంచ్‌లు కుంపట్ల చెల్లారావు, జవ్వాది జోగేశ్వరరావు ధాన్యం కుచ్చులను పవన్‌కు అందజేశారు. పట్టణానికి చెందిన కవి గౌరినాయుడు తాను రచించిన పుస్తకాలు, అవంత్స సోమసుందర్ రచనలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.భానుప్రసాద్ చెక్కతో తయారు చేయించిన ఎడ్లబండి, అందులో రైతు, జనసేన జెండాలతో కూడిన జ్ఞాపిక తెచ్చారు.



తమ్ముడి వెంట : ఉగాది వేడుకలకు హాజరైన నాగబాబు తదితరులు



తరగని అభిమానం : చేబ్రోలులో పవన్ నివాసం వద్ద అభిమానుల కోలాహలం



పవనాభిమానం : పవన్‌కు జ్ఞాపిక.. పవన్‌తో ఫొటో

గుండెల నిండా పవన్



అయినవిల్లిలో సర్వాలంకార భూషితుడైన విఘ్నేశ్వరుడు



మండపేటలో అగస్తేశ్వర స్వామికి మల్లె పువ్వులతో అర్చన

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తెలుగు నూతన సంవత్సరాది ఆరంభం అంబరాన్నంటింది. ప్రజలు సంస్కృతీ, సంప్రదాయాల మేళవింపుతో ఉగాదిని వేడుకగా జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాశి ఫలాలను వివరిస్తూ పండితులు పంచాంగ శ్రవణం గావించారు. పలుచోట్ల ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వరస్వామి, అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయాలు ఉగాది శోభను సంతరించుకున్నాయి... 8లో

క్రోధి నామ సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో జీవించాలి

కలెక్టరేట్‌లో సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

అమలాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి తొలి పండుగ ఉగాది అని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో జిల్లాలోని ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వపరంగా ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాంగమంటే వేలు పట్టుకుని నడిపించే దైనందిని అని, ఏడాది కాలానికి దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరిసే పండుగను ఉగాదిగా పేర్కొన్నారు. అందరిలోనూ ఉప్పొంగే ఉత్సాహాలను, చిగురించే సంతోషాలను, విరబూసే వసంతాలను, సకల శుభాలను అందించాలని కోరారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది పండుగ కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ఉజ్వలభవిష్యత్తుకు, జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో సంప్రదాయబద్ధంగా వేద పఠనం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుక నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేసిన కొమానపల్లి సూర్యనారాయణాచార్యులు, ఆరుగురు అర్చకస్వాములకు కలెక్టర్ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఎ.బోసుబాబు, పశుసంవర్ధక అధికారి వెంకట్రావు, డీటీవో రామనాథం, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, డీఈవో ఎం.కమలకుమారి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్‌శర్మ, పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎల్డీఎం కె.శ్యామ్‌బాబు, దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనరు డి.నాగమల్లేశ్వరరావు, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వ్యాఖ్యాత సుబ్రహ్మణ్యం, వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేద పండితుడిని సన్మానిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రాంతీయ ఓటర్లే లక్ష్యంగా...

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- హైదరాబాద్‌లో కోనసీమ అభ్యర్థుల ప్రచారం
- పలుచోట్ల సభలు, సమావేశాలు
- హోరెత్తిస్తున్న టీడీపీ, జనసేన నేతలు
- ఎన్నికల్లో తమ విజయానికి సహకరించాలని అభ్యర్థన

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌తో కోనసీమవాసులకు విడదీయలేని అనుబంధం ఉంది. ఉపాధి అవసరాల నిమిత్తం కూలినాలి పనులు చేసుకునే సగటు కార్మికులతో పాటు విద్యావంతులు, వ్యాపార లావాదేవీల నిమిత్తం వేల కుటుంబాలు హైదరాబాద్ కేంద్రంగా జీవనం సాగిస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు లక్షలాదిగా ఉపాధి అవసరాల నిమిత్తం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్కడ ఉండే ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో వివిధ ప్రధాన పార్టీల అభ్యర్థులు అక్కడ విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటర్లు, పారిశ్రామిక వేత్తలు, అభిమానులతో కలిసి సంయుక్తంగా కీలక సమావేశాలు నిర్వహించడం ద్వారా ఆయా నియోజకవర్గాల ఓటర్లను ఆకర్షించడానికి సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఏయే ప్రాంతాల్లో ఓటర్లు ఉన్నారో వారి జాబితాలను ముందస్తుగా సిద్ధం చేసుకుని అక్కడి కల్యాణ మండపాల్లో భారీ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. విందు భోజనాలతో సౌకర్యాలు కల్పించి ఏపీలో జరుగుతున్న ఎన్నికల్లో తమకు సహకరించాలని అభ్యర్థిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కోనసీమ జిల్లా నుంచి ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సహా కోనసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన కీలక నాయకులు అక్కడ వేర్వేరుగా సమావేశాలను ఇటీవల నిర్వహించారు. తమ నియోజకవర్గ ఓటర్లే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కీలక సమావేశాల్లో అభ్యర్థులు ఓటర్లతో మమేకమై మే 13న జరిగే ఎన్నికల్లో తమకు విజయం చేకూర్చాలంటూ అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థులకు సైతం ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులు, ఓటర్లు ఘనంగా స్వాగతం పలుకుతూ ర్యాలీలతో తోడ్కొని వెళ్లారు. తమకు అనుకూలమైన కేడర్‌కు అభ్యర్థులు దిశానిర్దేశం చేశారు. మిగిలిన అభ్యర్థులు కూడా ఒకరోజు హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అటు టీడీపీ, ఇటు జనసేన, బీజేపీ, వైసీపీలకు చెందిన నాయకులు హైదరాబాద్‌లో ఉన్న ప్రాంతీయ ఓటర్లే లక్ష్యంగా సభలు, సమావేశాలు నిర్వహించి వారిని ఆకట్టుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారుచేస్తున్నారు. అక్కడ ఉన్న ప్రజలు సైతం ప్రాంతీయ భవనంతో నేతలకు ఘన స్వాగతం పలుకుతూ నైతిక మద్దతు తెలుపుతుండడంతో ఆయా రాజకీయ పార్టీల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుచ్చిబాబు (పాత చిత్రం)





ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన వలసదారులు

నూకాంబికా అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలమూరు, ఏప్రిల్ 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో చింతలూరు నూకాంబికా అమ్మవారి దర్శనానికి ఉగాది పర్వదినం నాడు భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ, ఉత్సవ ప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్, జేఏ భాస్కర్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో చింతలూరుకు దూరంగా వాహనాలను నిలుపుదల చేశారు. నూకాంబికా అమ్మవారికి బద్ది కడుగుట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చింతలూరి వెంకటాచలం ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణం చేశారు. నూకాంబికా అమ్మవారిని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, పలువురు నాయకులు దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న సత్యానందరావు, శ్రీనివాస్

సీ-విజిల్ యాప్‌లో 237 ఫిర్యాదుల పరిష్కారం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నట్టు సీపీవో వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా నియమావళి ఉల్లంఘనపై అందిన ఫిర్యాదుల రోజువారీ నివేదికను ఆయన వివరించారు. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు 348 ఫిర్యాదులు రాగా వాటిలో 77 ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించామన్నారు. మిగిలిన 271 ఫిర్యాదుల్లో వంద నిమిషాలలోపు 237 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 34 ఫిర్యాదులను వంద నిమిషాల వ్యవధి పైబడిన తరువాత పరిష్కరించినట్టు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా జిల్లాకు సంబంధించి గత నెల 16 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 27 ఫిర్యాదులు రాగా వాటిని కూడా సకాలంలో పరిష్కరించినట్టు సీపీవో తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విస్తృత దాడులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలాపురం రూరల్, పామర్రు పీఎస్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. మండల పరిధిలోని కామనగరువు శివారు విత్తనాలవారి కాల్వగట్టు, ప్రతాప్‌నగర్, బీవీ రమణయ్యకాలనీ, మెండువారిపేటల్లో కవాతు నిర్వహించారు. స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఓటర్లుస్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో ద్రాక్షారామలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట పరిధిలో ఎస్ఈబీ నిర్వహించిన దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు ఎన్డీపీ లిక్కరు సీసాలు, మూడు లీటర్ల ఐఎంఎల్, 39 డ్యూటీపెయిడ్ లిక్కరు సీసాలను, 7.20 లీటర్ల ఐఎంఎల్, 40లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఏడు కేసులు నమోదు చేశామన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు నిర్వహించిన దాడుల్లో నర్సాపురపుపేట చెక్‌పోస్టు పరిధిలో రూ.1,11,800 నగదు, సఖినేటిపల్లిలో రూ.84,505 నగదు స్వాధీనం చేసుకున్నట్టు అడ్మిన్ ఎస్పీ తెలిపారు.



వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తున్న ప్రత్యేక పోలీసు అధికారులు

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు

● శ్రీసిద్ధివినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధివినాయకుడు, లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అయినవిల్లి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలి పూజలు అందుకునే దైవం, విఘ్నాలు నివారించే విఘ్నేశ్వరుని నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా స్వామిని దర్శించుకుంటే విఘ్నాలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దాంతో అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అయినవిల్లి ఆలయం కిక్కిరిసింది. రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లు, ఆలయ మండపం భక్తులతో కిక్కిరిశాయి. దర్శనానికి గంటల కొద్దీ భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది సేవలు అందించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్నసమారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

ఆదాయం 2.. వ్యయం 14

● శ్రీ క్రోధి నామసంవత్సరంలో ఇదీ సత్యదేవుడి లెక్క
● అన్నవరంలో వేదపండితుల పంచాంగ శ్రవణం
● పండితులకు సత్కారం ● వెండి రథంపై ఊరేగింపు

అన్నవరం, ఏప్రిల్ 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం క్రోధి నామసంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడు మ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేకవేదికపై ఆశీనులు గావించారు. ప్రత్యేకపూజలు అనంతరం దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాఠి పంచాంగ శ్రవణం పఠించారు. మఖ నక్షత్రం, సింహరాశి కలిగిన సత్యదేవుడికి ఈఏడాది ఆదాయం 2, వ్యయం 14 ఉందని దీనిద్వారా భక్తులకు క్రోధి నామసంవత్సరంలో భక్తుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈఏడాది అన్నివర్గాల ప్రజలకు అనుకూలత లభిస్తుందన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐదుగురు పండితులను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు ఘనంగా సత్కరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 10గంటలకు వెండిరథంపై స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు పండితుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రాత్రి 7గంటలకు వెండిగజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ముద్రించిన పంచాంగంను ఉచితంగా పంపిణీ చేశారు. సత్యదేవుడి సన్నిధిలో ఏర్పాటుచేసిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. పలువురు భక్తులు వీటివద్ద స్వీయచిత్రాలు దిగడం విశేషం. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో, చైర్మన్

ప్రధాన గర్భాలయంలో

తలుపులమ్మ దర్శనం

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ తల్లి

తునిరూరల్, ఏప్రిల్ 9: తలుపులమ్మ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. 15నెలలుగా ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా దిగువ బాలాలయంలో భక్తులను అనుగ్రహిస్తున్న తలుపులమ్మ అమ్మవారు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇప్పటికే పూర్తయిన ప్రధాన గర్భాలయంలో భక్తులకు దర్శనమిచ్చే విధంగా ఏర్పాట్లు చేయడతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్ దంపతులు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం చేపట్టి అనంతరం ఆలయ అర్చకులకు ఉగాది పురస్కారాలతో పాటుగా ముఖ్య అర్చకులకు రూ.10,116 లు, ప్రసంశాపత్రాలు అన్నవరం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ అందజేశారు.



పంచాంగ శ్రవణం పఠిస్తున్న అర్చకులు

చంద్రబాబు, పవన్ సభ విజయవంతం చేయాలి

● రేపు అంబాజీపేట, అమలాపురంలలో బహిరంగ సభలు
● పర్యటనపై సమీక్షించిన నాయకులు

అంబాజీపేట, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ సభను కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడు కోరారు. అంబాజీపేటలోని వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, నిమ్మల రామానాయుడు, కొత్తపల్లి సుబ్బరాయుడులు మాట్లాడుతూ అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గంలోని కూటమి పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో తరలివచ్చేలా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఉమ్మడిపార్టీలు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలోని 68 గ్రామాల్లోని జనసమీకరణ చేసి భారీగా మోటార్‌సైకిళ్లతో ర్యాలీగా సభస్థలానికి చేరుకోవాలన్నారు. తొలుత అంబాజీపేట హైస్కూల్‌లో ఏర్పాటుచేసే హెలిప్యాడ్‌లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పరిశీలించారు. అధినేతలు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగి అక్కడ నుండి అంబాజీపేట- అమలాపురం ప్రధాన రహదారిలో ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అమలాపురంల లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, నాయకులు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, యర్రా వేణుగోపాలరాయుడు, షేక్ సుభాన్, చీకరుమల్లి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు పెదపూడి శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాస్, సుదా బాబ్జి, తోలేటి సత్తిబాబు, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

ఉగాది ప్రత్యేక పూజలు

● భక్తులతో ఆలయాలు కిటకిట



భీమేశ్వరాలయంలో ఉగాది పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఏప్రిల్ 9: క్రోధి నామసంవత్సరం, ఉగాది, కొత్తసంవత్సరం మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం, పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు, అంజిబాబు తదితరులచే ముందుగా భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం నంది మండపంవద్ద ఈవో నీలకం ఠం తదితర భక్తుల నడుమ ఉగాది పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం సీతారామచంద్ర స్వామి ఆలయ పండితులు బృందావనం వెంకట రమణమూర్తిచే పంచాంగ శ్రవణం నిర్వహించి ఆయా రాశుల వారికి పంచాంగ ఫలాలను వివరించారు. ఆలయ ఈవో నీలకంఠం పండితులు వెంకటరమణ మూర్తికి పండిత సత్కారం నిర్వహించారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులచే భక్తులకు పంచాంగ ప్రతులను అందజేశారు. ఈవో ఉగాది పచ్చడిని పలువురికి అందజేశారు. ఈ పూజలలో జనసేన నాయకులు బిక్కిన రాజశేఖర్ దంప తులు తదితర ఆలయ సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో 600 మంది భక్తులకు, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం వెలుపల సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

వసంతనవరాత్ర మహోత్సవాలు పురష్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి వసంత నవరాత్ర మహోత్స వాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు నంది మండపంవద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులు, బిక్కిన రాజశేఖర్ దంపతులు ఆశీనులయ్యి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశేష కుంకుమార్చన పూజలలో కూరగాయల గొల్లబాబు అనిత దంపతులు, కుసుమంచి శేషగిరిరావుపావని దంపతులు, కుసుమంచి శ్యామ్ కుమార్‌హారిక దంపతులు ఆశీనులయ్యారు. పూజల అనంతరం ప్రసాదవితరణ నిర్వహించారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

● సింహ వాహనంపై విహరించిన శ్రీవారు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9:వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. చతుర్వేద పారాయణం, ద్రవిడ వేద పారాయణంలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా కాల్పుల నడుమ గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తీరు వీధుల్లో విహరించారు. చంగోలం పారాయణం, పరమపదోత్సవం, నీరాజన మంత్రపుష్పంలతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి చెందాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వెంకటేశ్వరరావు(80) పోక్సో కేసులో 20 ఏళ్ల శిక్షపడి గతేడాది అక్టోబరు 10న విజయవాడ జైలు నుంచి ఇక్కడికి వచ్చాడు. వయసు రిత్యా రుగ్మతలవల్ల ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతుండగా పలుమార్లు వైద్యం అందించారు. శ్వాస తీసుకో వ డంలో ఇబ్బంది ఏర్పడడంతో గతనెల 27నుంచి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. గుండెపోటు రావడంతో సోమవారం మృతి చెందాడని జైలు అధికారులు పేర్కొన్నారు.

పూజారినని.. దోచుకున్నాడు..!

● కరపలో అమ్మవారి ఆభరణాలతో పరార్

వాకాడ (కరప), ఏప్రిల్ 9: పూజారినని నమ్మించి అందినకాడికి దోచుకున్న ఘరానా మోసగాడి ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ గ్రామంలో జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బాబాజీశర్మ అనే వ్యక్తి గత ఏడాదిన్నర నుంచి పూజారిగా పనిచేస్తున్నాడు. పశ్చిగోదావరిజిల్లా పసలపూడి గ్రామానికి చెందిన బాబాజీశర్మ పూజారి విధుల నుంచి తప్పుకోవడంతో గ్రామపెద్దలు మరో పూజారి కోసం బ్రాహ్మణ సంఘం పెద్దలను సంప్రదించారు. ఇదిలా వుండగా కృష్ణచైతన్య అనే వ్యక్తి మార్చి 28న గుడికి వచ్చి పూజారిగా విధులు నిర్వహిస్తానని నమ్మబలికి రూ.5వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున గుడికి వచ్చి సంప్రోక్షణ, స్వామి అమ్మవార్లకు పూజాధికాలు నిర్వహించి దూపదీప నైవేద్యం సమర్పించాడు. పాత పూజారి సమక్షంలో గర్భగుడిలోని అమ్మవారి బంగారు ఆభరణాలు ఉండే లాకర్‌ను తెరిచి రికార్డు ప్రకారం అన్నీ సరిచూసుకున్నాడు. తాను కాకినాడ గాంధీనగర్‌లో ఉంటున్నానని, ఇక్కడకు వచ్చేస్తానని, గ్రామంలో పూజారి కోసం ఎప్పుడూ కేటాయించే ఇంటిని శుభ్రంచేయాలని పెద్దలకు సూచించాడు. ఈ ఇంట్లోకి అవసరమైన సామాన్లు కొనుగోలు చేసుకోవడానికి రూ.20వేలు నగదు, ఒక స్కూటీని తీసుకుని అదేరోజు వెళ్లిపోయి నాలుగు రోజులైనా తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన గ్రామస్తులకు సదరు వ్యక్తి సెల్‌కు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కంగారుపడిన ఆలయకమిటీ పెద్దలు లాకర్ తెరిపించి చూడగా అమ్మవారికి చెందిన 28గ్రాముల వివిధ ఆభరణాలు కనిపించలేదు. దీంతో మోసపోయామని గుర్తించిన గ్రామస్తులు నిందితుడి ఆచూకీ కోసం గాలించారు. ఈ ఘరానా మోసగాడు కరపలోని ఒక ఫర్నీచర్ షాపు వద్దకు వెళ్లి వాకాడ శివాలయం పూజారిగా పరిచయం చేసుకుని రూ.5వేలు విలువచేసే గ్యాస్ స్టౌ, కుక్కర్, తదితర సామాన్లు కొనుగోలుచేసి మళ్లీ వచ్చి డబ్బులిస్తానని వెళ్లిపోయాడు. అయితే ఆ డబ్బుల కోసమని వాకాడ గుడికి వచ్చిన ఫర్నీచర్ షాపు యజమాని జరిగిన విషయం తెలుసుకుని షాపు వద్ద ఉన్న సీసీ టీవీ పుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించారు. ఆలయకమిటీ సభ్యులు అడబాల సూర్యప్రకాశరావు, వెలుగుబంట్ల వీరవెంకటసత్యనారాయణ, గ్రామదేవత ముసాలమ్మతల్లి గుడి కమిటీ చైర్మన్ అడబాల బుచ్చిబాబులు మంగళవారం కరప పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసి నిందితుడి ఫొటోలను అందజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ పుటేజ్ ద్వారా గుర్తించిన దొంగ పూజారి చిత్రం

సీఆర్సీలో ఉగాది ఆహ్వాన

నాటిక పోటీలు ప్రారంభం



'ఆస్తికలు' నాటికలోని ఒక సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై 24వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ, సీఆర్సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి ప్రారంభించారు. రాత్రి ఏడు గంటలకు గంగోత్రి 'పేదకాకాని వారి 'అస్తికలు' నాటికను ప్రదర్శించారు. దీనికి నాయుడు గోపి దర్శకత్వం వహించగా.. రచన పిన్నమనేని మృత్యుంజయరావు, సంగీతం రమణ, మేకప్ పి.రమేష్, రంగాలంకరణ ఎల్.అనిల్‌కుమార్. కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పండు క్రియేషన్స్ ఒంగోలు వారి 'పక్కింటి మొగుడు' హాస్య నాటికను ప్రదర్శించారు. బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించగా... రచన గోవిందరాజుల నాగేశ్వరరావు, సంగీతం రమణ, రంగాలంకరణ, ఆహార్యం పాటిబండ్ల కమలాకర్. కళాకారులు అభిమానులను కడుపుబ్బా నవ్వించారు.

పరిణితి చెందిన కొబ్బరికాయల కొనుగోలుకు

కేంద్రం గ్రీన్‌సిగ్నల్

● క్వింటా రూ.3,013 వంతున నాఫెడ్ ద్వారా కొనుగోలు

అంబాజీపేట, ఏప్రిల్ 9: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు పరిణితి చెందిన కొబ్బరి కాయలను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రైతులవద్ద పరిణితి చెందిన కొబ్బరి (ముక్కుడు) కాయలు, పిలకకాయలకు, బోడకాయలకు రూ.3,013 వంతున కొనుగోలు చేసేందుకు మద్దతు ధర ప్రకటించింది. దీనికి సంబంధించి గత నెలలో భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్యదర్శి అజిత్‌కుమార్‌సింగ్ జీవో జారీ చేసినట్లు సమాచారం. ఈ కొనుగోలు బాధ్యతను నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌లకు అప్పగించింది. వీటి ద్వారా రైతులవద్ద నేరుగా వలిచిన కొబ్బరికాయలను క్వింటాళ్ళ వంతున కొనుగోలు చేస్తారు. వీటిని అనంతరం ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ కంపెనీ (ఎఫ్‌పీవో)లకు విక్రయించి వాటి ద్వారా కోప్రా తయారు చేయించుకుని వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. దీని ద్వారా కొబ్బరి రైతులకు కొంతమేర ఉపశమనం పొందవచ్చు. రైతుల వద్ద నిల్వఉన్న కాయలను కొనుగోలు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వివాహిత అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన ఆశపు నాగజ్యోతి(33)కి నగరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన ప్రభుసాగర్‌కి 2016లో వివాహం జరిగింది. జ్యోతి సోమవారం రాత్రి నిద్రించి మంగళవారం ఉదయం మేల్కోలేదని ఆమె తల్లిదండ్రులకు ప్రభుసాగర్ ఫోన్ చేశాడు. దీంతో హుటాహుటిన వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె మృతదేహం చూడగా మెడపై కమిలిన చారలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకుని ప్రభుసాగర్‌ని ప్రశ్నించారు. సోమవారం ఆమెతో గొడవ జరగడంతో ఉరి వేసుకుందని ప్రభుసాగర్ చెప్పినట్టు తెలుస్తోంది. తన కూతురిని గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆ గొడవల నేపథ్యంలో ఆమె హత్యకు గురై ఉంటుందని తండ్రి వెంకటేశ్వర రావు ఆరోపిస్తూ పిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ పేర్కొన్నారు.

దుళ్లలో ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు

● మురమండ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి




మురమండ-దుళ్ళ నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి విజేతకు మెమెంటో, నగదు

కడియం, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కడియం మండలం మురమండ-దుళ్ల రోడ్డులోని నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు మంగళవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 200 కిలోల బరువుతో 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్ ఎడ్లు ప్రథమ స్థానాన్ని, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ద్వితీయ స్థానం, గోకవరం మండలం ముల్లేరు మల్లవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీను ఎడ్లు తృతీయ స్థానం, మురమండకు చెందిన కురసాల లలితేష్ ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు కన్సోలేషన్ బహుమతిగా జ్ఞాపికలు అందించారు. న్యాయనిర్ణేతలుగా మురమండకు చెందిన మొగలపు వెంకటరామకృష్ణారావు, వై.రమేష్‌లు వ్యవహరించారు. మొగలపు హరిశ్చంద్ర ప్రసాద్, వట్టికూటి జానకీరామ్, కొరపాటి చిన్నా, ముత్యాల సత్యనారాయణ ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్

రాష్ట్ర డైరెక్టర్ పదవికి భద్రయ్య రాజీనామా



పసలపూడి భద్రయ్య

పెరవలి, ఏప్రిల్ 9: వైసీపీ నాయకుడు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కుమ్మరి శాలివాహన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తూర్పుగోదావరి జిల్లా పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్య రాష్ట్ర డైరెక్టర్ పదవికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 10న నిడదవోలులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరనున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదని, ముఖ్యంగా బీసీలకు చేసిం దేమి లేదని విమర్శించారు. గతంలో తాను టీడీపీలో చాలాకాలం ఉన్నానని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందని, అందువల్ల తాను సొంతగూటికి చేరుతున్నట్టు ప్రకటించారు.

జాతీయస్థాయిలో చందుకు కాంస్య పతకం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 9: కర్నాటకలోని దేవగిరిలో జరిగిన 27వ జూనియర్ నేషనల్ సపక్‌తక్రా చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన మంచాల చందు ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని దక్కించుకున్నట్టు కోచ్‌లు యాండ్ర గౌతమ్, కేతా సతీష్ తెలిపారు. చందును అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సైదులు రమణ, జీవీ బాబు, ఫిజికల్ డైరెక్టర్లు కేవీఎన్ ప్రసాద్, బూల చిరంజీవి, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన చందును అభినందిస్తున్న దృశ్యం

కోడిపందాల స్థావరంపై దాడి

రంగంపేట, ఏప్రిల్ 9: మండలంలోని వడిశలేరు గ్రామ శివారులో మంగళవారం కోడి పందాల స్థావరంపై తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడికత్తులు, రూ.2290 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోటరీ క్లబ్ వాటర్‌కూలర్ అందజేత

మండపేట, ఏప్రిల్ 9: బూరుగుంట చెరువు పార్కుకు మండపేట రోటరి క్లబ్ అధ్యక్షుడు చంద్రు అగస్తరాజు మంగళవారం వాటర్‌కూలర్‌ను బహూకరించారు. ఈకూలర్‌ను వాకర్స్‌క్లబ్ సభ్యులుమంగళవారం ప్రారంభించారు.

మండపేట మెయిన్‌రోడ్డులో ఉన్న తన షాపు వద్ద మంగళవారం టీడీపీ 30వవార్డు ఇన్‌చార్జి గుత్తుల సత్తిబాబు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రథం గుడిసెంటరులో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రకేంద్రాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు ప్రారంభించారు.

- అమ్మవారు ఆలయాలు భక్తులతో కిటకిట
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం పఠనం
- విశేష అలంకరణల్లో అమ్మవార్లు

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఎన్నిక

మండపేట, ఏప్రిల్ 9: మండపేట దివైశ్య యూత్ 2024-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కార్యవర్గం అధ్యక్షుడుగా నూలు సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడుగా కంచర్ల కార్తీక్, కార్యదర్శిగా మండవల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కంచర్ల జలమురళీ, సహాయ కార్యదర్శిగా ఇంకొల్లు, శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య జిల్లా కార్యదర్శి కంచర్ల చినవీరభద్రరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నాళం చినబీమయ్య అన్నదాన సత్రం తరపున ప్రచురించిన పంచాగాలను సంఘ మాజీ అధ్యక్షుడు నాళం కిట్టు ఆవిష్కరించి, అనంతరం పంచాగాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వాచర్ల గుప్తా, కంచర్ల ప్రసాద్, చక్కా రాంబాబు, మన్యం మహేష్, గోనగిరి సుబ్బారావు, సంకా బాబ్జి, గ్రంధి శేషగిరిరావు, బోనగిరి సత్తిబాబు, రామకృష్ణ, పెరుమాళ్ల రాంబాబు, పులవర్తి సతీష్ తదితర వైశ్య ప్రముఖులు కార్యవర్గాన్ని అభినందించారు.

త్వరలో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం



మండపేట,. ఏప్రిల్ 9: జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పిఠాపురంలో మంగళవారం జనసేన రాష్ట్ర కార్యదర్శి కె.నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మండపేటలో త్వరలో టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ఈసమవేశానికి నాగబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. నాగబాబుకు నియోజకవర్గంలోని పరిస్థితులను ఆయన వివరించారు.

గౌడ సంఘీయులకు ఉగాది పురస్కారాలు

అమలాపురంరూరల్, ఏప్రిల్9: కామనగరువు సర్దార్ పాపన్న గౌడ్ కోనసీమ గౌడ సేవాసంఘం భవనంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దాసరి వెంకటరమణ, డాక్టర్ వెలిగట్ల వెంకటేష్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్, విశ్రాంత పోలీసు అధికారి నిచ్చెనకోళ్ల సుదర్శనరావు విద్య ప్రాముఖ్యతను వివరించారు. సేవా సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), కార్యదర్శి మట్ట సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వీరిన సాయిరామ్, మిద్దే పట్టాభి, దాసరి జగదీశ్వరి, వెలిగట్ల శ్రీను, శిరిగిబత్తిన జగన్మోహనరావు, రేలంగి దుర్గారావుతో పాటు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు. సేవా సంఘం ప్రతినిధులు దాసరి చిన్నా, కామన గంగాధరరావు, దాసరి సాయిబాబుపాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల కోసం ఎమ్మార్పీఎస్ పూజలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కొంకాపల్లిలోని శ్రీసత్తెమ్మ తల్లి ఆలయంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు నూటుకుర్తి మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 101కొబ్బరికాయలు కొట్టారు. విజయం సాధించిన అనంతరం మొక్కు తీర్చుకుంటామన్నారు. కూటమి అభ్యర్థులకు ఎమ్మార్పీఎస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మంథా ఫణికుమార్, బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు, చుట్టుగుళ్ల నీలకంఠం, పనసా బుజ్జి, చిక్కం సరస్వతి, తొత్తరమూడి ప్రభాకరరావు, కొడమంచిలి కృష్ణ, చాట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు





కొత్తపేట:ఉగాది పూజల్లో పాల్గొన్న బండారు సత్యానందరావు, ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో పంచాగ శ్రవణం

ముమ్మిడివరం, ఏప్రిల్ 9: కళాసాహితీ ఆధ్వర్యంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర వేడుకలనునిర్వహించారు. రవీంద్ర విద్యా సంస్థల ప్రాంగణంలో కొత్తూరి లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవులు, పండితులు పంచాంగ శ్రవణం ఆలపించారు. ఎన్.అబ్బులు, వీవీప్రసాదరావు, అరిగెల నాగేంద్రలు కవితా గానాన్ని ఆలపించారు. ఉద్యోగ విరమణ చేసిన ఏవీఎస్ మాష్టారును వేదికపై కళాసాహితీ సభ్యులు సత్కరించారు. పీవీ నరసింహవర్మ, చోడపనీడి ప్రకాష్, వడ్డి నాగేశ్వరరావు, గిడ్డి ప్రభాకరరెడ్డి, యలమంచిలి బాలరాజు, పి.భాస్కరవర్మ, జనిపల్లి సత్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, కె.వెంకటాచార్య, ఎం.శ్రీనివాసరావు, పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రోధినామఉగాది వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ప్రజలు దేవాలయాలకు, అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పురోహితులు, అర్చకులు పంచాంగాలకు ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణాన్ని ఆలపించి ఉగాది పచ్చడిని అందించారు. ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక భజనా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని దేవాలయాలు, అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

పి.గన్నవరం: క్రోధినామ సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. పి.గన్నవరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పంచాగ శ్రవణంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ కార్యాలయంలో అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు వైసీపీ నాయకుల సమక్షంలో పంచాగ శ్రవణం, పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లాకార్యదర్శి వాసంశెట్టి కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, తాటికాయల శ్రీనివాసరావు, కర్రి బాబురావు కోట రాజేంద్రప్రసాద్, షేక్ దొరబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: మండలంలోని పలు దేవాలయాల్లో ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో సహాయ కమిషనర్ గ్రంథి మాధవి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని వేదపండితులు ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు. పంచాంగ శ్రవణం అనంతరం విసినకర్రలు, పంచాంగాలను భక్తులకు అందించారు. మామిడికుదురు నూకాలమ్మ ఆలయం వద్ద పంచాంగ శ్రవణం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో ఉగాది ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుతగా విజయదుర్గా అమ్మవారికిఅభిషేకాలు, అర్చనలు జరిపి ప్రత్యేక అలంకరణ జరిపారు. వేకువజామున పీఠానికి చేరుకున్న భక్తులకు గాడ్ కుమార్తె గాదే సత్యవెంకటకామేశ్వరి భక్తులకు ఉగాదిపచ్చడి, కుంకుమ ప్రసాదం అందజేశారు. పీఠంలోభక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ క్రోధి నామ సంవత్సర ఫలితాలను భక్తులకు వివరించడంతో పాటు దైవారాధనతోనే చింతలు తొలగుతాయన్నారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, పురోహితులు చక్రవర్తుల మాధవచార్యులు, భక్తులు పాల్గొన్నారు. మంగళవారం రాత్రి పీఠంలో వసంత నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి అర్చ నలు, చతుర్వేదస్వస్తి, దర్బారుసేవ, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు.

మలికిపురం: మంగళవారం మండలంలో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలను సందర్శించారు. పలుచోట్ల పంచాంగ శ్రవణాలు చేశారు. మలికిపురం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాంగ పఠనం తరువాత కొత్తపేటకు చెందిన నాట్యమయూరి అవార్డు గ్రహీత కుమారి రావి బేబిసత్యవాణి నృత్య ప్రదర్శన జరిగింది. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కాదంబరి రామారావు, కార్యదర్శి ఫణికృష్ణ, కోశాధికారి విశ్వేశ్వరరావు, సేవాసమితి అధ్యక్షుడు జవహర్‌లాల్, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ తన స్వగృహం విశ్వేశ్వరాయపురంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం వేదపండితులు పంచాంగకర్త ఖండవల్లి సూర్యసత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో జరిగింది. నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్వేది: దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వింజమూర్తి రామరంగాచార్యుల పంచాంగ శ్రవణాన్ని పఠించారు. స్వామి-అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయమంతా పూలతో అలంకరించి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పండిత సత్కారం నిర్వహించారు. విశేష సేవలందించిన ఆలయ అర్చకులు, సిబ్బందిని ప్రశంసా పత్రంతో సత్కరించారు. మంగళవారం ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. 6వేలమంది భక్తులు స్వామి-అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఆత్రేయపురం: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పంచాంగాలు, విసినకర్రలను పంపిణీ చేశారు. ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం జరిపి పంచాంగాలు, విసినకర్రలను పంపిణీ చేశారు. ప్రజలు తమ రాశి ఫలాలను తెలుసుకున్నారు. వాడపల్లి ఆలయాన్ని వివిధ పుష్పాలతో ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ కటౌట్ ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,48,343 లభించినట్టు ఉపకమీషనర్, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

రాజోలు: మండలంలో ఉన్న పదహారు గ్రామాల్లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో పలు ఆలయాల వద్ద ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి-అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజోలులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల రాజోలు నియోజకవర్గ అభ్యర్థి దేవ వరప్రసాద్ పాల్గొని సంఘ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శివాలయంలో శ్రీ గౌతమీ పుష్కర వేదపాఠశాల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. పంచాంగ కర్త కాశీభొట్ల పార్వతీదీక్షితులు పంచాంగ పఠనం చేశారు. గుండుబోగుల పెదకాపు, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, రాజోలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, చలువాది త్రినాథ్, అడబాల విజయ్, గుండాబత్తుల తాతాజీ, కాట్న రాజు, అడబాల విజయ్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

కె.గంగవరం: ఉగాది వేడుకలను మండలంలో ప్రజలు మంగళవారం నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మంగళవారం సాయంత్రం క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేడవరపు గోపాలకృష్ణ పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు పంచాంగాలు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన లలిత నాట్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మండలంలోని పలు ఆలయాల్లో పంచాగ శ్రవణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద తీర్థాలు నిర్వహించారు. మొసలపల్లి శ్రీబాలగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో గాంధీసెంటర్ రామాలయం వద్ద ఏకాహం కార్యక్రమాన్ని జోగి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కపిలేశ్వరపురంలోని శ్రీపాపవినాసేశ్వర, అగస్తేశ్వరస్వామి వార్ల ఆలయంలో, అంగర శ్రీవేణుగోపాలస్వామి, శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి, టేకిలో శ్రీపార్వతీ సోమేశ్వరస్వామి వారి ఆలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, తమ పిల్లాపాపలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రజలు భగవంతుని కోరుకున్నారు. వేదపండితులకు కానుకలు సమర్పించి ఆశీర్వచనాలు పొందారు. ఆయా ఆలయాల ఈవోలు, సిబ్బంది, వేదవిద్యార్థులు, గ్రామప్రముఖులు, ఆయా గ్రామస్తులు, భక్తులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మండపేట: మండపేట అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారిని 200కిలోల మల్లిపూలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం చేశారు.

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకులు జరిగాయి. తొలుత ఆలయ పురోహితులు, అర్చకులు పంచాంగాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యానానికి చెందిన నాగాభట్ల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగశ్రవణం చేశారు. క్రోధినామసంవత్సరంలో చోటుచేసుకునే మార్పులు, వ్యాపార వ్యవసాయ స్థితిగతులను వివరించారు. ద్వాదశరాశుల ఫలితాలను వివరించారు. భక్తులకు పంచాంగాలు, ప్రసాదం వితరణ చేశారు. పంచాంగశ్రవణకర్తను సన్మానించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. సహాయ కమిషనర్, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమలాపురం రూరల్: బండారులంక శివారు చినచంద్రపురంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద ప్రముఖ పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సర విశిష్టతలను వివరించారు. శ్రీలక్ష్మీగణపతి సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పుగంటి బాస్కరరావు, కార్యదర్శి బళ్ల మల్లేశ్వరరావు గురూజీ, పడవల ఉమామహేశ్వరరావు, చింతా పోతురాజు, ఆశపు చిన్ని, దంగేటి బుల్లబ్బులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కాకిలేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాంగకర్త భీమేశ్వరరావును సత్కరించారు. గ్రామస్తులకు పంచాంగాలను పంపిణీ చేశారు.

కొత్తపేట: క్రోధి నామ సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం కాపు కల్యాణ మండపంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆర్ఎస్‌బీసీ కన్వెన్షన్ హాలులో ఉగాది వేడుకలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు. ఆహూతులందరికీ ఉగాది పచ్చడి, పంచాంగాలు పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉగాది సందర్భంగా మంగళవారం అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామదేవతల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల్లో వసంత నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. వాడపర్రు మందాలమ్మ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు జరిపారు.

జాతర మహోత్సవాలు ప్రారంభం



అంబాజీపేటలో వనువులమ్మ జాతర నిర్వహిస్తున్న భక్తులు









ఐ.పోలవరం: మురమళ్ళ మాణిక్యాంబ, కపిలేశ్వరపురం:వల్లూరు శ్రీపార్వతిఅగస్తేశ్వరస్వామి, రావులపాలెం: ముమ్మిడివర్పాడులో గరగాలమ్మ, అంతర్వేది: శ్రీకనకదుర్గమ్మ

ముమ్మిడివరం, ఏప్రిల్ 9: కోరిన వెంటనే కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరు గాంచిన శ్రీకొండాలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతీ ఏటా ఉగాది రోజున అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభించి ఎనిమిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవ విగ్రహాన్ని నిలిపి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఉగాది సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శ్రీముసలమ్మతల్లి తీర్థ మహోత్సవం

పి.గన్నవరం, ఏప్రిల్ 9: రాజులపాలెంలో శ్రీముసలమ్మతల్లి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. 19వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. పేరిచర్ల వెంకటరామరాజు, గోపీనాథ్, పెన్మత్స రామకృష్ణంరాజు, పేరిచర్ల గంగరాజు, పూసపాటి సూర్యకాంతం, ముదునూరి చిట్టిబాబు, కోల్నాడ వీరబాబు, పుయ్యం సాయిగుణ రంజక్‌రాజు అమ్మవారికి ప్రసాద వితరణ చేశారు. లంకలగన్నవరం గ్రామదేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో, జొన్నల్లంక సత్తెమ్మతల్లి ఆలయంలో అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు.

మాణిక్యాంబ జాతర మహోత్సవాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 9: ఐలెండ్ వాసుల ఇలవేలుపు మురమళ్ళ మాణిక్యాంబ జాతర మహోత్సవాలు నెల రోజుల పాటు వైభవంగా జరిగాయి. మహిళల గరగ నృత్యాలు, తీన్ మార్‌డప్పులు, కేరళ డప్పుల దరువు, శక్తివేషాలు, బాలికల కోలాటం, కనులు మిరుమిట్లుగొలిపే బాణసంచా కాల్పులతో జాతర ఉత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. జాతర చివరి రోజు మంగళవారం రాత్రి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నెల రోజులు ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఎస్ఐ భానుప్రకాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మావుళ్లమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు

కాట్రేనికోన, ఏప్రిల్ 9: కాట్రేనికోన గ్రామదేవత మావుళ్ళమ్మ ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు జరిగాయి. విఘ్నేశ్వర ఆరాధనతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం పంచాంగశ్రవణం చేశారు. వేదుల హనుమాన్‌సిద్ధాంతి, తాతపూడి వెంకటసోమనిద్‌కృష్ణ సిద్ధాంతి పంచాంగశ్రవణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి, పానకాలు అందించారు.

దొడ్డి గంగాలమ్మ జాతర

మామిడికుదురు,ఏప్రిల్9: నగరంగ్రామదేవత శ్రీదొడ్డిగంగాలమ్మ జాతరను సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. చిత్రవిచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు

అంతర్వేది, ఏప్రిల్ 9: సఖినేటిపల్లిపాలెం శ్రీముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈనెల13 వరకు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీరోజు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీనివాసరాజు, సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ అమ్మవారి జాతర

అంబాజీపేట, ఏప్రిల్ 9: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీవనువులమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి పూజఘటాలను మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్ద నుంచి ఉత్సవంగా తీసుకువచ్చి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవంలో తీన్‌మార్ వాయిద్యాలతో పాటు గరగనృత్యాలు, కోయిదాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పుల్లేటికుర్రు పుంతలోముసలమ్మ ఆలయం వద్ద తీర్థం జరిగింది.

ఘనంగా స్వామివారికి అభిషేకాలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్9: వల్లూరులో వేంచేసిన శ్రీపార్వతి అగస్తేశ్వరస్వామివారికి మంగళవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పండితులు పలు విశేష పూజలు, అభిషేకాలను వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేట: తాళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు

రావులపాలెం: ఉగాది సందర్భంగా అమ్మవార్ల జాతర్లు, తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని ముమ్మిడివరప్పాడు, ఈతకోట, వేదిరేశ్వరం గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీసుబ్బాలమ్మ తీర్థ మహోత్సవం

అమలాపురం టౌన్: ఉగాదిని పురస్కరించుకుని అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు బారులు తీరారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా దేవదాయ శాఖాధికారులు బొక్కా వెంకటేశ్వరరావు, కోనేటి కార్తీక, కె.గంగాధర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో తీర్థం నిర్వహించారు. మంత్రి పినిపే విశ్వరూప్-బేబీమీనాక్షి దంపతులు, గుత్తి మల్లికార్జునరావు, భ్రమర సుబ్బలక్ష్మి అమ్మవార్ని దర్శించుకున్నారు.

ఘనంగా తాళ్లమ్మ అమ్మవారి తీర్థం

కొత్తపేట,ఏప్రిల్9: కమ్మిరెడ్డిపాలెం గ్రామదేవత తాళ్ళమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా ఉగాది రోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఫరంపేటలో మంచినీటి సరఫరా

యానాం, ఏప్రిల్ 9: యానాం నియోజవర్గం ఫరంపేట గ్రామంలో మంచినీళ్ల రాక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామప్రతినిధులు ఆరోపించారు. పలు మార్లు అధికారులు చెప్పినప్పటికి పట్టించుకోకపోవడంతో విషయం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణం స్పందించారు. రెండు మంచినీటి ట్యాంకర్లద్వారా నీటిని గ్రామస్తులకు పంపారు. మల్లాడి కృష్ణారావుకు గ్రామప్రతినిధులు బడుగు బలరాం, గుబ్బల విజయ్, పోతుల హరి కృష్ణ, ఎం.సంపత్‌రావులు కృతజ్ఞతలు తెలిపారు.

లంకలగన్నవరంలో ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం, ఏప్రిల్ 9: లంకలగన్నవరంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ గెలుపు కోసం టీడీపీ, జనసేన శ్రేణులు ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామదేవత శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు అనంతరం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు యన్నాబత్తుల వెంకటేశ్వరావు, కొపనాతి సీతారామస్వామి, గ్రామశాఖ అధ్యక్షులు లంకే చిరంజీవి, యర్రంశెట్టి రమణ, నాయకులు గనిశెట్టి శ్రీనివాస్, ఈశ్వర్, లంకే బీమరాజు, వేమన రామకృష్ణ, పిల్లి శివయ్య, మాల్లాడి గోపి, కామాడి రామకృష్ణ, చిట్టాల జోగేశ్వరావు, నల్లా పెద్దకాపు, అడబాల రంగారావు, రాపాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి రూ.40వేలు విరాళం

అంతర్వేది, ఏప్రిల్ 9: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దర్శనం అనంతరం స్వామివారి నిత్య శాశ్వత సుదర్శన హోమానికి విజయవాడ కంకిపాడుకు చెందిన విట్టంశెట్టి వెంకటనాగసత్యనారాయణ-వెంకటసునీత దంపతులు రూ.40వేలు విరాళం అందించారు.

చలివేంద్రం ప్రారంభం

ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యాప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఈవో పి.టి.వి.సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ నాయకుల ప్రచారాలు

యానాం, ఏప్రిల్ 9: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్‌డీఏ అభ్యర్థి ఏ.నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డీవీవీ సత్యనారాయణ, కనకాల రామదాసు, నరసింహమూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, లోకరాజు, కాకి నాగేశ్వరరావు, లక్ష్మీబాయ్ తదితరు నాయకులు, మహిళ మోర్చ, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు. పుదుచ్చేరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు నేతృత్వంలో యానాంలోని గోపాల్‌నగర్ ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

ముమ్మిడివరంలో దివ్యాంగుల పాలాభిషేకం



ముమ్మిడివరం, ఏప్రిల్ 9: చంద్రబాబు సీఎం అయిన వెంటనే దివ్యాంగులకు పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని ప్రకటించడం పట్ల అభినందనలు తెలుపుతూ ముమ్మిడివరంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు నలమాటి లంకరాజు ఆధ్వర్యంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మంగకృష్ణమాదిగ చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ముమ్మిడివరపు రాజేష్, బొక్కా విశ్వేశ్వరరావు, పి.చిన్నారి, పి.శ్రీనివాస్ ఉన్నారు.

కాలి నడకన భద్రాచలానికి ఇద్దరు భక్తులు

మండపేట, ఏప్రిల్ 9: మండపేట 22వ వార్డుకు చెందిన పిల్లి సత్తిబాబు, నల్లా వీర్రాజులు మంగళవారం భద్రాచలం రాములవారి ఆలయానికి మొక్కుతీర్చు కునేందుకు కాలినడనక మంగళవారం బయలు దేరారు. సీతారాములు కల్యాణం జరిగే సమయానికి భద్రాచలం చేరుకుంటారు.

వేగుళ్లను కలిసిన జనసైనికులు



మండపేట, ఏప్రిల్ 9: స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వ రరావును ద్వారపూడికి చెందిన జనసైనికులు కలిసిఉగాది శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.కూటమి విజయానికి కృషిచేస్తామని జనసైనికులు భరోసా ఇచ్చారు. వేగుళ్లను కలిసిన వారిలో జనసేన ద్వారపూడి గ్రామకమిటీ అధ్యక్షుడు చింతా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మండా వీరభద్రరావు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీవీరభద్రరావు, చిన్నెటి శ్రీనివాసరావు, చిక్కాల రాజా, సత్తి వరప్ర సాద్, సాలాపు శ్రీనివాస్, సత్తి వరప్రసాద్, జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి శెట్టిరవి, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి ఉన్నారు.

వైభవంగా సిరిపల్లమ్మ జాతర



అయినవిల్లి, ఏప్రిల్9: సిరిపల్లిలో గ్రామదేవత సిరిపల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారి గరగల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సిరిపల్లిమ్మ ఆలయ కమిటీ తెలిపింది.

విజయానికి సహకరించండి

మామిడికుదురు, ఏప్రిల్9: పి.గన్నవరం నుంచి పోటీ చేస్తున్న తన విజయానికి సహకరించాలని కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ కోరారు. మంగళవారం నగరంలో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, వాసంశెట్టి కుమార్, జాలెం సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



ఐ.పోలవరం, ఏప్రిల్ 9: ఐ.పోలవరం పంచాయతీ పెదమడికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి మంగళవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తుల సాయి, గుత్తుల వెంకన్నబాబు ఆధ్వర్యంలో ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో మేడిశెట్టి గంగిశెట్టి, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, గుత్తుల గురుమర్తి, విత్తనాల ప్రసాద్, కడలి అర్జునరావు, పాటి రాంబాబు, పాటి శ్రీనివాసరావు, పాటి నాగేశ్వరరావు, దంగేటి సత్యనారాయణ, పాటి మీరాసాహెబ్, గుబ్బల లక్ష్మణరావు, గుబ్బల రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, గంజా సుధాకర్, జనసేనకు చెందిన దేవు రాంబాబు, రాయపురెడ్డి బాబి, సవరపు వెంకట్, కొప్పిశెట్టి గణేష్, ఇళ్ళ నారాయణ, పాటి వీరన్నబాబు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, ముదునూరి లింగమూర్తిరాజు పాల్గొన్నారు.

పేదలను విస్మరించి పెద్దలకు సహకరిస్తున్న మోదీ

ఉప్పలగుప్తం, ఏప్రిల్9: నల్లధనాన్నివెలికితీసి పేదలకు పంచుతానని హామీఇచ్చిన ప్రధానమంత్రి మోదీపాలనలో జరిగిందేమిటో ప్రజలు గుర్తించారని పీసీసీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు వ్యాఖ్యానించారు. మంగళవారంఆయన ఉప్పలగుప్తంలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో విజ్ఞులైన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు.

40లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, ఏప్రిల్9: వద్దిపర్రులో సారా తయారీ విక్రయాలపై మంగళవారం ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. 40లీటర్ల నాటుసారాతో మట్టా నాగేశ్వరరావును అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. 200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసంచేసి కేసు నమోదుచేసి ఒక వ్యక్తిని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

ఆలయాలు భక్తులతో కిటకిట

అంతర్వేది, ఏప్రిల్ 9: సఖినేటిపల్లి మండలంలో అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అంతర్వేది దేవస్థానం, అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరీ, వీవీమెరక, టేకిశెట్టిపలెం, రామేశ్వరం, గొంది తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఆలయాల వద్ద భజనా కార్యక్రమం నిర్వహించి సాయంత్రం దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు.

శాకంబరీగా శారదాదేవి

యానాం, ఏప్రిల్9: యానాంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మీ దంపతులకు యానాం బ్రాహ్మణసంఘ సభ్యులు, వేదపండితులు ఆశీర్వాదం అంజేశారు. గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

గోశాలకు 50కిలోల దాణా వితరణ

అంతర్వేది, ఏప్రిల్ 9: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుకుని ఉన్న గోశాలకు మోరి వాస్తవ్యులు యేడిద శ్రీనివాస్-భవానీ దంపతులు 50కిలోల దాణా బస్తాను అందించారు. జక్కంపూడి మాణిక్యాలరావు, బెల్లంకొండ రాంబాబు, వంకాయల సర్వేశ్వరరావు, రావి ప్రసాద్ పాల్గొన్నారు.